ప్రజాశక్తి
శుక్రవారం 5 డిసెంబర్ 2025 8 పేజీలు


ప్రకాశం


బాపట్ల

సిపిఎం కార్యకర్తలపై
అక్రమ కేసులు దుర్మార్గం

- ప్రజాపోరాటాలను అణిచే యత్నం
- సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు


సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

కనిగిరి సిపిఐ(యం) కార్యకర్తలపై పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి యస్.కె. మాబు గురువారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. కనిగిరి పట్టణ పరిధిలోని మాచవరానికి చెందిన ఒక యువతిపై జరిగిన అన్యాయంపై పలుమార్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవటం విచారకరమని ఆయన విమర్శించారు. రెండు నెలలుగా న్యాయం కోసం తిరుగుతున్న బాధితురాలికి తోడుగా పార్టీ ప్రజాసంఘాల నాయకులు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టగా, దీనిని సహించలేని పోలీసులు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని మాబు తెలిపారు. కనిగిరిలో ఎన్నో ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఐ(యం) పట్టణ కార్యదర్శి పిసి కేశవరావు, ఐద్వా పట్టణ కార్యదర్శి కె లక్ష్మీప్రసన్న, సిఐటియు నాయకుడు యు పిచ్చయ్యలుచేస్తున్న ప్రజా పోరాటాన్ని అణగదొక్కే ప్రయత్నమే ఈ కేసుల నమోదు అని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి దుర్మార్గపు చర్యలతో ప్రజాపోరాటాలను బలహీనపర్చాలనే పోలీసుల యత్నం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.ప్రజల తరపున, బాధితుల తరపున నిలబడే వారిపై కేసులు పెట్టడం సమంజసం కాదని మాబు తీవ్రంగా ఖండించారు. ఈ అక్రమ అరెస్టులను ప్రజలు, ప్రజాతంత్రవాద శక్తులు ఖండించాలని మాబు కోరారు.

మార్కాపురం మెడికల్ కాలేజీపై..
వెనక్కి తగ్గని ప్రభుత్వం

- అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలూ తీవ్ర అభ్యంతరం
- ప్రైవేటుకు అప్పగించి.. చేతులు దులుపుకునేందుకు సిద్ధం
- కొత్త జిల్లాలో ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలన్న డిమాండ్


నిర్మాణ దశలో ఉన్న మార్కాపురం మెడికల్ కాలేజి (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మార్కాపురం మెడికల్ కాలేజీపై ప్రభుత్వం వెనక్కు తగ్గే యోచనలో కనిపించడం లేదు. ప్రైవేటుకు అప్పగించి చేతులు దులుపుకునేందుకే ప్రాధాన్యత ఇస్తోంది. కొత్త జిల్లా ఏర్పాటవుతున్న తరుణంలో మెడికల్ కాలేజీని ప్రభుత్వ ఆధీనంలోనే నడిపితే పేదలకు మరింత మేలు జరుగుతుందన్న డిమాండు పశ్చిమ ప్రాంత ప్రజానీకంలో పెరుగుతోంది. అన్ని రాజకీయపార్టీలు మెడికల్ కాలేజీని ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రైవేటీకరణను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించింది. వైసిపి కోటి సంతకాల పేరుతో ప్రత్యేక కార్యక్రమం కూడా చేపట్టింది. దీనిపై నిరంతర పోరాటం నడుస్తోంది. మరో వైపు విద్యార్థి సంఘాలూ గురువారం నాడు విద్యారంగంలోని అనేక సమస్యలతో పాటు మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ బంద్ చేపట్టాయి.

అన్ని వైపులా ఆందోళనలు పెరుగుతున్నాయి. అయినా ప్రభుత్వం మాత్రం దీనిపై స్పందించడం లేదు. ఎదురుదాడి మొదలు పెడుతున్నారు. ప్రైవేటుకు అప్పగించడంపై పాలకపక్ష ఎమ్మెల్యేలు సమర్థించుకుంటున్నారు. ప్రభుత్వ ఆధీనంలో నడవాల్సిన మెడికల్ కాలేజీని కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేటుపరం చేస్తుంటే దాన్ని మంచిపనిగా చెప్పుకుంటున్నారు. నిధులు కేటాయించి పూర్తిచేయాల్సిన కర్తవ్యాన్ని మరిచారు. ఎన్నికల్లో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తామని పశ్చిమ ప్రాంతంలో కూటమి నేతలు ప్రకటించారా? ఎన్నికల ప్రచారంలో ఈ విషయాన్ని చెప్పారా? అనేది ఆలోచించుకోవాలి. ప్రభుత్వం చేసిన నిర్ణయం ప్రజలకు నష్టం కలిగిస్తుందని తెలిసినా వ్యతిరేకంగా మాట్లాడకూడదనే భావనతోనే ఎమ్మెల్యేలు దాన్ని సమర్థించుకుంటున్నారు. దీని వల్ల జరిగే నష్టాన్ని గుర్తించినా కూడా దాన్ని ప్రయోజనంగా భావిస్తున్నారు. ఇది మంచికా? చెడుకా? అనేది పాలకపక్ష నేతలు భవిష్యత్‌లో తెలుసుకుంటారు. మార్కాపురం వద్ద రాయవరం వద్ద గత ప్రభుత్వ హయాంలో మెడికల్‌కాలేజీ మంజూరు చేశారు. 41.97 ఎకరాలు కేటాయించారు. రూ.450 కోట్లు నిధులూ కేటాయించారు.ఇక్కడపనులు మొదలయ్యాక మార్కాపురం వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చారు.420బెడ్లను సిద్ధం చేశారు.విభాగాల వారీగా బెడ్లు కూడా కేటాయించారు.72 మంది వైద్యులను కేటాయించారు. రెండు ఆక్సిజన్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేశారు. వైద్యులు, ఆధునిక పరికరాలు ఉన్నందున ఓపీ కూడా ▶ 2లో

విద్యాసంస్థల బంద్ విజయవంతం

- జిల్లావ్యాప్తంగా
- విద్యార్థి సంఘాల
- నిరసనలు



బంద్ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎపి జేఏసీ పిలుపుతో గురువారం జిల్లావ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ పాఠశాలల నుంచి కళాశాలల వరకు పలు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. ర్యాలీలు, నిరసనలు, సమావేశాలతో విద్యార్థి సంఘాలు చేపట్టిన బంద్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ బంద్ నిర్వహించినట్లు నాయకులు పేర్కొన్నారు. మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వ రంగంలోనే నిర్మించాలని, జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీ, ట్రిబుల్ ఐటీకి నిధులు కేటాయించి నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, కేజీ నుండి పీజీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని 10 అంశాల డిమాండ్ పత్రాన్ని ప్రకటించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి సమస్యల పరిష్కారం కోసం సైకిల్ యాత్రలు, ధర్నాలు, చలో విజయవాడ వంటి అనేక కార్యక్రమాల్ని చేపట్టినా ప్రభుత్వం స్పందించలేదని నాయకులు విమర్శించారు. విద్యాశాఖ మంత్రితో చర్చలు జరిపినా సమస్యలు యథాతథంగానే ఉన్నాయని పేర్కొన్నారు. ఒంగోలు నగరంలో ఎస్ఎఫ్ఐ, పీడీయస్యూ, జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ పాఠశాలలను మూయించారు. నెల్లూరు బస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు సిహెచ్.వినోద్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పాల్గొన్నారు. మార్కాపురం జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరాస్వామి నేతత్వంలో ర్యాలీ నిర్వహించి బంద్‌ను విజయవంతం గావించారు. దర్శిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ విద్యార్థులతో సమావేశం నిర్వహించి, అనంతరం ఆయన నాయకత్వంలో ర్యాలీ చేపట్టారు. కనిగిరిలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారావు ఆధ్వర్యంలో విద్యార్థులు భారీగా పాల్గొని బంద్ నిర్వహించారు. గిద్దలూరులో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కే.ఆరోన్, నాయకులు తేజ, అమర్నాథ్ పాల్గొని బంద్ నిర్వహించారు. అనంతరం సమస్యల కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. చీమకుర్తిలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దేవరాజు పాల్గొని బంద్ కార్యక్రమం నిర్వహించారు. సింగరాయకొండలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు దేవా ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. సంతనూతలపాడు మండలం మంగమూరులో ఎస్ఎఫ్ఐ నాయకుడు నవీన్ ఆధ్వర్యంలో బంద్ విజయవంతం చేశారు. కొండేపిలో విద్యార్థులు స్వతంత్రంగా బంద్ నిర్వహించగా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కేజీ మస్తాన్ పాల్గొని సంఘీభావం ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన బంద్ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ విద్యాసమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

డిడిఓతో
అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం

- ప్రజలకు మెరుగైన సేవలందించాలి
- కార్యాలయాలను ప్రారంభించిన కలెక్టర్ రాజాబాబు


డిడిఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డివిజన్ స్థాయిలో అభివద్ధి అధికారి ఉండటంతో క్షేత్రస్థాయిలో పరిస్థితులపై పర్యవేక్షణ పెరిగి అభివద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. పాత జడ్పీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఒంగోలు డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారి, డ్వామా ఏపీడీ కార్యాలయాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖలో వినూత్న మార్పులు చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో అభివద్ధిని పరుగులు పెట్టించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగానే ఎంపిడిఒలకు పదోన్నతులు ఇచ్చి డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా బాధ్యతలను అప్పగించిందన్నారు. తద్వారా ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఎంపిడిఒలకు పదోన్నతులు లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని డివిజనల్ స్థాయి కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు అధికారులు పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. తొలుత రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ల కార్యాలయాలను చిత్తూరు నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించి, అనంతరం ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ప్రసంగాన్ని కలెక్టర్, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మిప్రసన్న, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్, జడ్పీ ఇన్‌ఛార్జి సిపిఒ జాలమ్మ, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిఎల్‌డిఒ సిహెచ్ సువార్త, ఎంపిడిఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్కాపురం మెడికల్ కాలేజీపై

వెనక్కి తగ్గని ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

రోజుకు 800 వరకూ పెరిగిందని చెబుతున్నారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక మెడికల్ కాలేజీ పనులు ఆగిపోయాయి. 70 శాతం పనులు పూర్తిచేసినట్లు వైసిపి నేతలు చెబుతుండగా సగం కూడా జరగలేదని కూటమి నేతలు చెబుతున్నారు. పనులు మాట ఎలా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం అసలు దాని వైఖరే మార్చుకుంది. మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో ప్రవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయం తీసుకుంది. ఏడాదిన్నరగా పనులు నిలిపేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ కూడా తమ సామాగ్రిని తరలించుకుపోయింది. బిల్లులు పెండింగులో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక పిపిపి పద్ధతిలో అంటే దాన్ని పూర్తిగా ప్రవేటు కంపెనీలకు అప్పగిస్తారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ఇచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సీట్లు కూడా పంపకాలు చేయనున్నారు. వైద్యసేవలకూ ఛార్జీలు తప్పవు. కార్పొరేట్ కంపెనీలు తాము పెట్టిన పెట్టుబడికి లాభం లేకుండా సేవ చేస్తాయనుకోవడం భ్రమే అవుతుంది. కోటి రూపాయలు పెట్టుబడి పెడితే రెండు కోట్లు లాభం లేనిదే ముందుకు వస్తాయా? ఆలోచించాలి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో కనీసం ఎమ్మెల్యేల మాట కూడా వినే పరిస్థితి ఉందా? అనేదీ ఆలోచించాలి. ఏదేమైనా రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీని ప్రైవేటుకు అప్పగించేందుకే ముందుకు పోతోంది. దీనిపై వ్యతిరేకత కూడా తీవ్రతరమవుతోంది. కొత్త జిల్లాలో ప్రభుత్వం ఆధీనంలోనే నడపాలనే డిమాండ్ ముందుకు వచ్చింది.

నల్లమల అడవుల్లో పులుల లెక్కింపు ప్రారంభం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నల్లమల అటవీ ప్రాంతంలో పులుల లెక్కింపు కార్యక్రమం ప్రారంభమైంది. మార్కా పురం డివిజన్ పరిధిలోని యర్రగొండ పాలెం రేంజ్‌లో బీట్ అధికారులు తమ తమ బీట్‌లలో మూడు రోజుల పాటు ట్రయల్ పాత్ విధానంలో మాంసాహార జంతువుల గణన చేపడుతున్నారు. ఈ గణనలో పెద్దపులులు, చిరుత పులులు, ఎలుగుబంట్లు, రేచు కుక్కలు వంటి జంతువుల వివరాలు సేకరిస్తున్నారు. అదే విధంగా శాఖాహార జంతువుల లెక్కింపు చెట్లు, గడ్డి జాతులపై ప్లాట్ల సహాయంతో వివరాలను సేకరించి ఎకలాజికల్ యాప్‌లో నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా గత మూడు రోజులలో కొలుకుల, తెలుగురాయుని చెరువు బీట్‌ల పరిధిలో పెద్దపులుల జాడలు సేకరించినట్లు యర్రగొండపాలెం రేంజ్ అధికారి ఏ ప్రసన్న జ్యోతి గురువారం తెలిపారు. ఈ గణన కార్యక్రమం ద్వారా నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంఖ్య, జీవ వైవిధ్యంపై స్పష్టమైన అంచనా లభిస్తుందని తెలిపారు.


పులుల పాదముద్రలు సేకరిస్తున్న సిబ్బంది

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-మార్కాపురం: ఈ నెల 13వ తేదీ శనివారం ఉద యం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్ మార్కాపురం పట్టణంలోని కోర్టు ఆవరణలో ప్రారంభమవుతుందని ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం శుభవాణి గురువారం తెలిపారు. నాలుగు బెంచీలుగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు లోక్ అదాలత్‌లో రాజీ కుదర్చనున్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పీటీఎంలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-రాచర్ల

మండలంలోని అన్ని పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింలను విజయ వంతం చేయాలని రాచర్ల మండల విద్యాశాఖ అధికారి వి గిరిధర్ శర్మ ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశా రు. రాచర్ల మండల ప్రజా పరిషత్తు కార్యాలయం సమావేశం హాల్‌లో గురు వారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యా శాఖ అధికారులు పీటీఎం కార్యక్ర మంపై సమావేశం నిర్వహించారు. పేరెంట్స్ టీచర్స్ మీటింగులకు విద్యా ర్థుల తల్లిదండ్రులందరినీ హాజరు పరిచే లాగా చూడాలని, పాఠశాల పరిధిలోని ప్రజా ప్రతినిధులు కూడా సమావేశానికి హాజరయ్యేలా చూడా లని, పేరెంట్స్ టీచర్స్ విద్యార్థుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాచర్ల ఎంపీడీఒ ఎస్ వెంకటరామిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఒ ఓవికె శ్రీనివాస్‌కుమార్, ఎంఈఓ మొహిద్దీన్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- బస్టాండు నిర్మాణానికి కృషి
- యాత్రికుల సౌకర్యార్థం డార్మిటరీ
- త్వరలో అన్న క్యాంటిన్ ఏర్పాటు
- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు




పెద్దదోర్నాల ఆర్‌టిసి బస్టాండు ప్రాంగణం (ఇన్‌సెట్‌లో) గూడూరి ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల కేంద్రమైన పెద్దదోర్నాలకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. దక్షిణ కాశీగా పేరొందిన శ్రీశైల పుణ్యక్షేత్రానికి దిగువన ఉన్న పెద్దదోర్నాల పట్టణం దిగువ శ్రీశైలంగా కూడా పిలవబడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఏ మూల నుంచి శ్రీశైలం వెళ్లాలన్నా పెద్దదోర్నాల మీదుగా రాకపోకలు సాగించాల్సిందే. పెద్దదోర్నాల పట్టణం నానాటికీ విస్తరిస్తోంది. అందుకు కారణం శ్రీశైల పుణ్యక్షేత్రానికి యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరగడమే. నల్లమల అటవీ అందచందాలు తిలకించేందుకు టూరిస్టులు వస్తున్నారు. మన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి మార్కాపూర్ రోడ్ రైల్వే స్టేషన్ మీదుగా చేరుకునేవారు సైతం పెద్దదోర్నాల మీదుగా ప్రయాణం చేయాల్సి ఉంది. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రహదారులన్నీ రద్దీ ఉంటాయి. ఓ విధంగా చెప్పాలంటే నిత్యం జనజాతరే. రాష్ట్రంలోని అన్ని ఆర్‌టిసి డిపోలు కూడా పెద్దదోర్నాల బస్టాండులో ఆగాల్సిందే. ఈ విధంగా పెద్దదోర్నాల పట్టణం అభివృద్ధి చెందుతోంది.

ఇక్కడ ప్రధానంగా ఆర్‌టిసి బస్టాండు సమస్యగా ఉంది. అవసరమైన స్థలం ఉండీ బస్టాండు నిర్మాణానికి నోచుకోలేదు. ఆర్‌టిసి బస్టాండు నిర్మాణంపై నేతలంతా హామీలు ఇవ్వడం తప్ప పని జరిగింది లేదు. ఇటీవల కాలంలో పెద్దదోర్నాలలో ప్రయాణికుల అవసరాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు గుర్తించారు. బస్టాండు నిర్మాణం కోసం సిఎం చంద్రబాబుతో చర్చించారు. బస్టాండు నిర్మాణానికి అవసరమైన జీవో ఇటీవలే విడుదలయింది. బస్టాండు నిర్మాణంతో పాటు యాత్రికులకు సౌకర్యంగా డార్మిటరీ నిర్మాణం ఉండనుంది. దీంతో పాటు ఆహార సదుపాయాలకు ఓ హోటల్ ఏర్పాటు చేయాలనేది ఎరిక్షన్‌బాబు ఆలోచన. ఓ ఏడాదిలో ఇదంతా పూర్తయ్యేలా ఎరిక్షన్‌బాబు కృషి చేస్తున్నారు. దీంతో పాటు నటరాజ్ సెంటర్ నుంచి సెంట్రల్ లైటింగ్‌తో యాత్రికులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దనున్నారు. జనం రద్దీతో ఉండే పెద్దదోర్నాలలో ఆర్‌టిసి బస్టాండు, డార్మిటరీ, హోటల్, సెంట్రల్ లైటింగ్ వంటి సౌకర్యాలతో ఇక్కడి రూపురేఖలు మారిపోనున్నాయి.

బాబాయి అంత్యక్రియల కోసం వచ్చి...

మన్నేరులో గల్లంతై..యువకుడు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

బాబాయి అంత్యక్రియల కోసం వచ్చి మన్నేరులో గల్లంతై ఓ ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన శింగరాయకొండ మండలం శానంపూడి గ్రామంలో చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... శానంపూడి గ్రామానికి చెందిన గుంజి వెంకటేశ్వర్లు(45) హైదరాబాదులో ఉంటూ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శానం పూడి గ్రామంలో ఉంటున్న ఆయన బాబాయి గుంజి ముసలయ్య ఇటీవల మృతిచెందాడు. గురవారం అంత్యక్రియలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెంకటేశ్వర్లు శానంపూడి వచ్చాడు. మృతదేహానికి మన్నేరు అవతల వైపు దహన సంస్కరణలు పూర్తి చేసి మన్నేరు స్నానం చేస్తున్నాడు. మన్నేరులోకి నీరు ఎక్కువగా వచ్చింది. దీంతో స్నానం చేస్తున్న వెంకటేశ్వర్లు నీటిలో కొట్టుకు పోయాడు. తోటి వారు ఈ విషయం గురించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బి.మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. పాకల గ్రామం నుంచి మత్స్యకారులను పిలిపించి గాలాలతో వెంటేశ్వర్లు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వెంకటేశ్వర్లు చొక్కా గాలాలకు చిక్కు కోవడం వెంటేశ్వర్లు మృతదేహం బయట పడింది. ఎస్ఐ మహేంద్ర కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.



మృతిచెందిన వెంకటేశ్వర్లు

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ : ఆర్‌టిసి బస్సు బైకున ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్ జంక్షన్ వద్ద గురువారం చోటుచేసుకుంది. శింగరాయకొండ బస్టాండ్ నుంచి కందుకూరుకు వెళుతున్న బస్సు ఉలవపాడు మండలం చాకిచెర్ల పట్టపు పాలెం చెందిన సున్నపు గిరి అనే వ్యక్తి బైకుపై గురుకుల పాఠశాల వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో బాలాజీ నగర్ మలుపు వద్ద బస్సు ఢీకొంది. దీంతో గిరికి తీవ్ర గాయాలయ్యాయి.క్షతగ్రాతుడిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌ను తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ మహేంద్ర సందర్శించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌ఒ ప్లాంట్ బహూకరణ

ప్రజాశక్తి- దొనకొండ : దొనకొండ జడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలోని బాలికల హస్టల్‌కు జడ్‌పి న్నత పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయులు తన సొంత నిధులలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను బహూకరించారు. హాస్టల్ విద్యార్థినులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన హెచ్‌ఎం తన సొంత నిధులతో రూ.80 వేల విలువైన వాటర్ ప్లాంట్ కొనుగోలు చేసి హస్టల్‌కు బహూకరించారు. వాటర్ ప్లాంట్‌ను బహూకరించిన హెచ్‌ఎం రామాంజనేయులుకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

రైతుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- కనిగిరి

రైతుల సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం కృషి చేస్తుందనిఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపార. కనిగిరి వ్యవసాయ మార్కెట్ కార్యాలయాన్ని గురవారం ఆయన దర్శించారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందుతున్న సేవలను, ప్రభుత్వ పథకాలను అమలు తీరును షేక్ జైను లాబ్దిన్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ మాల్యాద్రి, టిడిపి నాయకులు బాలు ఓబుల్ రెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, పిచ్చాల శ్రీనివాసరెడ్డి, ముచ్చు మారి చెంచిరెడ్డి, అమ్మిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కొంగలేటి సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటకున్న 'మానవతా'

ప్రజాశక్తి -పామూరు

మానవతా సంస్థ సభ్యులు మరోసారి తమ సేవా స్ఫూర్తి ప్రదర్శించారు. ఓ మహిళ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన తమ మానవత్వం చాటుకున్నారు. పామూరు పట్టణంలోని వైఎస్సార్ రోడ్డులో నివస్తున్న శ్రీరామ్ రవణమ్మ అనే వద్ధురాలు గురువారం మతి చెందారు. ఆమె కుటుంబం అంతక్రియలు నిర్వహించడానికి డబ్బు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం గురించి తెలుసుకున్న మానవతా సభ్యులు ముందుకొచ్చి అంతక్రియలు నిర్వహించారు. రూ. కుటుంబ సభ్యులకు రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ కల్లూరి రామిరెడ్డి, అధ్యక్షులు వెండిదిండి వెంకటేశ్వర రెడ్డి, కోడూరు ప్రభాకర్‌రావు, ఏనుగు సుధాకర్ రెడ్డి, పందిటి అల్లూరయ్య, ఇమ్మడిశెట్టి సత్తిబాబు, శ్రీనివాసులు, మధు, మదన్ తదితరులు పాల్గొన్నారు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న సంస్థ సభ్యుల

గ్రంథాలయ స్థలం పరిశీలన

ప్రజాశక్తి-తాళ్ళూరు

తాళ్లూరుకు చెందిన ఐవి.రెడ్డి తండ్రి ఇడమ కంటి చిన్నకోటిరెడ్డి ఐదు సెంట్లు స్థలాన్ని గతంలో గ్రంథాలయానికి ఇచ్చారు. ఈ సందర్భంగా తాళ్లూరు ప్రజల కోరిక మేరకు రాజ్యసభ సభ్యుడు వైవి.సుబ్బారెడ్డి తన నిధుల నుండి రూ. 35 లక్షలు మంజూరు చేశాడు. గ్రంథాలయానికి కేటాయించిన స్థలాన్ని రాజ్యసభ సభ్యుడు వైవి.సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు గురువారం సందర్శించార. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ భవ నిర్మాణ పనులు ప్రారంభించడానికి టెండర్లు పిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు తూముసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదనరెడ్డి, స్థానిక నాయకులు లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఐవి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి- కొత్తపట్నం : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని కె.పల్లెపాలెం గ్రామ పంచాయతీని డిపిఒ గరువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలో చెత్తన గుర్తించి వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి పరిశుభ్రంగా ఉంచి చెత్త రహిత గ్రామంగా ప్రకటించేందుకు అవసరమైన అన్ని పరిశుభ్రత చర్యలను చేపట్టాలన్నారరు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీకష్ణ, డిప్యూటీ ఎంపిడి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-కనిగిరి

రెవెన్యూ సమస్యలపై ప్రజా గ్రీవెన్స్ (పిజిఆర్‌ఎస్)లో అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరిస్తున్నట్లు తహాశీల్దారు జయలక్ష్మి తెలిపారు. కలెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో పవిత్ర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో మండలం నలుమూలల నుంచి వచ్చిన 169 అర్జీలలో 35 అర్జీలను తక్షణమే పరిష్కరించినట్లు ఆమె తెలిపారు. .భూవివాదాలున్న సందర్భాల్లో ఇరువురిని పిలిపించి ప్రశాంత వాతావరణంలో సంధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో భూ సమస్యలను క్షుణంగా పరిశీలించి పారదర్శకంగా నివేదికలు సమర్పించేలా రెవెన్యూ సిబ్బందికి సూచనలు జారీ చేసినట్టు తెలిపారు.



హీనా కౌసర్‌ను సన్మానిస్తున్న మద్ది శెట్టి శ్రీధర్

హీనా కౌసర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-ఒంగోలు

పేస్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ విభాగం అధ్యాపకురాలు షేక్ హీనా కౌసర్‌కి చెన్నైకి చెందిన సత్యభామ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. హైబ్రిడ్ ఫ్రేమ్ వర్క్స్ ఫర్ ఆండ్రాయిడ్ మాల్వేర్ డిటెక్షన్ యూజింగ్ స్టాటిక్ అండ్ డైనమిక్ డీప్ బి.హేవియల్ ఎనాలసిస్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను షేక్ హీనా కౌసర్ కి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ డాక్టరేట, ప్రిన్సిపల్ డాక్టర్ జీవీకేజ మూర్తి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ సివిజసుబ్బారావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఆర్. వీరాంజనేయులు, కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ డాక్టర్ ఎంజరమణ బాబు, డీన్ ట్రైనింగ్ అని ప్లేస్‌మెంట్ రూప అక్కేష్ తదితరుల డాక్టరేట్ పొందిన హీనా కౌసర్‌ను అభినందించారు.



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న ఎంపీ వైవి. సబ్బారెడ్డి, తదితరులు

వివాహ వేడుకల్లో వైసిపి నాయకులు

ప్రజాశక్తి-తాళ్ళూరు

తాళ్లూరు గ్రామానికి పారిశ్రామిక వేత్త ఇడమకంటి వెంకటరామిరెడ్డి, మంజుల కుమార్తె చరిష్మా రఘురామిరెడ్డి రిసెప్షన్ వేడుకలు స్థానిక భగవాన్ వెంకటరామయ్య సన్నిధిలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వైవి. సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, అద్దంకి ఎఎంసి మాజీ చైర్మన్ వై.విభద్రారెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, గొల్లపాటి మోషే, ఇత్తడి దేవదానం, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, నాయకులు ఐవి.సుబ్బారెడ్డి, కెవి.రెడ్డి, లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.



శ్రీవారి సన్నిధిలో లలితళ్ సాగర్ దంపతులు

శ్రీవారి సన్నిధిలో లలిత్ సాగర్

ప్రజాశక్తి-దర్శి

దర్శి ప్రాంతం అన్నీ రంగాలలో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని టిడిపి యవనేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ ఆకాక్షించారు. డాక్టర్ కడియాల లలిత్ సాగర్ జన్మదిన సందర్భంగా రాష్ట్ర డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మీ, కుటుంబ తమ సభ్యులతో కలిసి శ్రీవెంకటేశ్వరస్వామి వారిని గురువారం దర్శించుకున్నారు.

వాడీ వేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-కురిచేడు : కురిచేడు మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన గురవారం నిర్వహించారు. సమావేశంలో జడ్‌పిటిసి మాట్లాడుతూ మండలంలోని సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నెలల తరబడి పరిష్కారం కావడం లేదన్నారు. కురిచేడు గ్రామంలో బోర్లు చెడిపోయి ఆరు నెలలు కావస్తుందన్నారు. వాటి మరమ్మతుల గురించి తాను అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని తెలిపారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చేసిన పనికి ఎం బుక్కులల్లో నమోదు చేయడంలో ఎందుకు అలసత్వం చేస్తున్నారో అర్థం కావటం లేదని తెలిపారు. ఎంపిడిఒ సత్యప్రసాద్ మాట్లాడుతూ తాను ఇక్కడికి వచ్చి రెండు నెలలు కావస్తుందని తమ దష్టికి వచ్చిన సమస్యలను సాధ్యం మేరకు పరిష్కరిస్తానని తెలిపారు. అలా చేయలేని పక్షంలో ఇక్కడి నుంచి వెళ్ళిపోతానని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు, సర్పంచుల, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రైతుల గురించి జగన్ మాట్లాడటం హాస్యాస్పదం

- అన్నదాత సుఖీభవ 2విడతల్లో రూ.6310 కోట్లు
- రాష్ట్రాన్ని దివాలా తీయించిన ఘనత వైసీపీ దే
- ఎమ్మెల్యే ఏలూరి ధ్వజం



ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు

ముఖ్యమంత్రిగా ఐదేళ్ల పాలన కొనసాగించి ఒక్కరోజు కూడా పొలంలో అడుగుపెట్టని జగన్మోహనరెడ్డి నేడు అన్నదాతల సంక్షేమం గురించి మాట్లాడటం హాస్యాస్పంగా ఉందని, జగన్ ప్రకటనలు చూసి రైతులు నవ్వుకుంటున్నారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజమెత్తారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలను, రైతులను మరోసారి తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాడంటూ మాజీ సిఎం వైఎస్ జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్ల వైసిపి పాలన వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దెబ్బతీసిందని అన్నారు. రైతు సమస్యలు పరిష్కరించకుండా ఇప్పుడు తమ పాలన వైఫల్యాలు కప్పి పుచ్చుకునేందుకు జగన్ అబద్ధాల అంబాసిడర్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్మోహనరెడ్డికి లేదని దుయ్యబట్టారు. అన్నదాత సుఖీభవ రెండు విడతల్లో రూ.6310 కోట్లు రైతు ఖాతాల్లో జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో దాన్యం కొనుగోలు చేశాక డబ్బుల కోసం రైతులను నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పించుకుని వేధించారని, నేడు గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాలో సిఎం చంద్రబాబు జమ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ వైసిపి అసత్యాలు ప్రచారం చేస్తూ కుట్రలకు పాల్పడ్డారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలకు వాస్తవాలన్నీ తెలుసని, జగన్ తన తప్పులు కప్పిపుచ్చుకునే ప్రయ త్నం చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. 18 నెలల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి సూపర్ హిట్ పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో వ్యవసాయ రంగాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలిపేలా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. అన్నదాతకు వెన్నుదన్నుగా టిడిపి ప్రభుత్వం నిలుస్తుందని తెలిపారు. కష్టాల్లో ఉన్న నల్లబర్లీ పొగాకు రైతులను ఆదుకునేందుకు సిఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం దేశంలో ఎక్కడ ఎన్నడూ లేనివిధంగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని పొగాకు కొనుగోలు చేసామన్నారు. వేలాది మంది రైతులకు వెన్నుదన్నుగా నిలిచి రైతు కుటుంబాల్లో వెలుగులు నింపామన్నారు.

ధాన్యం బకాయిలు రూ .1,674 కోట్లు చెల్లింపు

2023 - 24 రబీకి ధాన్యం బకాయిలు రూ.1,674 కోట్లు వైసీపీ ప్రభుత్వం చెల్లించకుండా వదిలేస్తే కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుని ఆ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమచేసినట్లు ఏలూరి గుర్తు చేశారు. వైసిపి హయాంలో రైతు ఆత్మహత్యల కుటుంబాలకు ఇవ్వాల్సిన నష్టపరిహారం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం ఆలస్యం లేకుండా మంజూరు చేసిందని వివరించారు. జూన్ 2024 నుంచి ఇప్పటి వరకు 2లక్షల మంది రైతులకు రూ.310 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా చెల్లించామని చెప్పారు. పంటల బీమా పేరుతో రైతులను నిరాశపరిచిన వైసిపి ప్రభుత్వం కనీసం ప్రీమియం కూడా చెల్లించకపోవడంతో క్లెయిమ్‌లు రాకుండా చేశారని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు కోల్పోయిన రైతులకు రూ.50 కోట్లు ఇన్పుట్ సబ్సిడీ అందించామని వెల్లడించారు. పంట ధరలు పడిపోయినప్పుడు నేరుగా ప్రభుత్వం జోక్యం చేసుకుని గత 16 నెలల్లో రైతులకు రూ.800 కోట్లకుపైగా ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. పొగాకు రూ.271 కోట్లు, మామిడికి రూ.261 కోట్లు, ఉల్లి రూ.125 కోట్లు, కోకో రూ.14 కోట్లు, టమాటా రూ.12 కోట్లు ప్రభుత్వం ముందస్తుగా చెల్లించినట్లు చెప్పారు. ఉల్లి ధరలు క్వింటాకు రూ.1,200 కంటే తక్కువ వచ్చినప్పుడు వ్యత్యాస నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసిన తొలి ప్రభుత్వం ప్రస్తుత కూటమి ప్రభుత్వమేనని తెలిపారు. 1,20,754 క్వింటాళ్ల ఉల్లి సేకరించామని, నష్టపరిహారం రూ.25వేల నుంచి రూ.50వేలు అందిస్తున్నామని అన్నారు.



రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ మహేంద్ర నాథ్

చిరస్మరణీయులు కొణిజేటి రోశయ్య

ప్రజాశక్తి - చీరాల

బహుముఖ ప్రజ్ఞాశాలి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని ఎంజిసి క్లాత్ మార్కెట్ సెంటర్‌లోని రోశయ్య కాంస్య విగ్రహానికి తెలుగుదేశం నాయకులు, కూటమి నేతలు పూలమాల అర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్ మాట్లాడుతూ రాజకీయ, ఆర్థిక వ్యవహారాలపై విశేష జ్ఞానం కలిగిన గొప్ప నాయకులు రోశయ్యని అన్నారు. ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అన్ని పార్టీల గౌరవాన్ని అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశీలని పేర్కొన్నారు. రోశయ్య రాజకీయ జీవితం ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు, వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు దోగుపర్తి వెంకట సురేష్, పట్టణ అధ్యక్షురాలు దర్శి నాగేంద్రమణితో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణ గడువు పెంచాలి



మాజీ ఎమ్మెల్సీ సతీష్

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణ నూతన మాస్టర్ ప్లాన్ విధానంపై ప్రస్తుతం తయారు చేసిన డ్రాఫ్ట్ ప్రజా వ్యతిరేకత పొందే విధంగా ఉందని శాసన మండలి మాజీ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. పట్టణంలో మాస్టర్ ప్లాన్ అభ్యంతరాలపై ఆయన గురువారం మాట్లాడారు. పురపాలక సంఘ అధికారులు వార్డులు, పంచాయతీల్లోని వార్డు, గ్రామ సచివాలయాల్లో కమిషనర్ పట్టణ ప్రణాళిక అధికారి నేతృత్వంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజలతో చర్చించిన తర్వాత నూతన మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని కమిషనర్ రఘునాథరెడ్డికి సతీష్ ప్రభాకర్ వినతి పత్రం అందజేశారు. మాస్టర్ ప్లాన్ విధానంపై అభ్యంతరాలు స్వీకరించేందుకు మరో 30 రోజులు గడువు పెంచాలని కోరారు.



సినీ హీరో సజ్జ తేజను అభినందిస్తున్న బ్రహ్మం

సినీ హీరో సజ్జ తేజకు అభినందనలు

ప్రజాశక్తి - వేమూరు

తెలుగు సినీ హీరో సజ్జ తేజను జనసేన నాయకులు సోమరవుతు బ్రహ్మం మర్యాద పూర్వకంగా నోవా హెూటల్‌లో కలిశారు. ఈ సందర్భంగా తిరుమల, తిరుపతి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని తేజకు అందించారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ ఇంద్ర, హనుమాన్, మిరాకిల్ తదితర సినిమాల్లో నటించిన తేజా రానున్న రోజుల్లో సినీ పరిశ్రమలో మరింతగా అభివృద్ధి చెంది, పలు సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించాలని కోరారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఆయన అండగా ఉండాలని కోరారు.

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి



ఐసిడిఎస్ పీడీకి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - బాపట్ల

మిగిలిపోయిన మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరుతూ సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ ఆధ్వర్యంలో అంగన్వాడి నాయకులు ఐసిడిఎస్ పిడికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మజుందార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సెల్ ఫోన్‌లు ఇవ్వాలని కోరుతూ ఈనెల 12న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలు జయప్రదం చేయారని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్‌వాడీలకు వేతనం పెంచలేదని అన్నారు. 2023లో 42 రోజులు పాటు చారిత్రాత్మక సమ్మె ముగింపు సందర్భంగా అంగన్వాడీలకు జీతాలు పెంచుతామని అప్పటి ప్రభుత్వం మినిట్స్ రూపంలో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీ నేటికి అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో 1810 మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని ఇచ్చిన హామీ అమలు జరగలేదని అన్నారు. ఆయాల పదోన్నతులకు సంబంధించి రాజకీయ ఒత్తిళ్లు జరుగుతున్నాయని ఆరోపించారు. సెంటర్ నిర్వహణకు అవసరమైన సెల్ ఫోన్లు ఇవ్వలేదని అన్నారు. కార్యక్రమంలో శైల శ్రీ, హేమ, సిఐటియు పట్టణ కార్యదర్శి కె శరత్ పాల్గొన్నారు.

ఎన్జీఓ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎన్జీఓ సంఘ సభ్యులు

ప్రజాశక్తి - పర్చూరు

ఏపి ఎన్జీఓ సంఘం తాలూకా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం స్థానిక రోటరీ భవన్లో గురువారం నిర్వహించారు. ఎన్నికల అధికారి, ఉప ఎన్నికల అధికారి జి ఇసాక్, పి శేషగిరిరావు కార్యవర్గం ఎన్నికకు సంబంధించి ఒకే ఒక్క ప్యానెల్ నామినేషన్ చేయడంతో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నూతన కార్యవర్గం అధ్యక్షులు టి సుధాకర్, కార్యదర్శి సిహెచ్ ప్రేమ్ చందు, ట్రెజరర్ వివి నరసింహులు, అసోసియేట్ ప్రెసిడెంట్ మధు కుమార్, నలుగురు ఉపాధ్యక్షులు, నలుగురు జాయింట్ సెక్రెటరీలు కలిపి 20 మందికి చోటు లభించిందని ప్రకటించారు. వీరు ఎన్నికైనట్లు నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల తాలూకాలు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఎన్జీఓ సంఘ బాధ్యులు కె శరత్ బాబు, కృష్ణారెడ్డి, పి నాగేశ్వరరావు, బి ప్రసాద్, చంద్రశేఖర్, కెపి దాస్ పాల్గొన్నారు.

నేటి నుండి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరంలో శుక్రవారం నుండి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ కన్వీనర్ అభి తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి ఇస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు నిర్వహణ కమిటీ నిభందనలు పాటించాలని చెప్పారు. ప్రతి క్రీడాకారుడు అంపైర్ నిర్ణయానికి లోబడి ఉండాలని తెలిపారు. తుది నిర్ణయం నిర్వహణ కమిటీదేనని తెలిపారు. యువతలో ఉత్సాహం నింపేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు మరిన్ని వివరాలకు 63096 09364, 86392 18372 నంబర్లలో సంప్రదిం చాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

బౌద్ధ పూజ పోస్టర్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రేపల్లె

అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 6న రేపల్లెలో ర్యాలీ, బౌద్ధ పూజా కార్యక్రమం జయప్రదం చేయాలని పోస్టర్స్ ఆవిష్కరించారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో ప్రజాస్వామ్యవాదులు, అంబేద్కర్, దళిత, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల ప్రతినిధులు పోస్టర్స్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ వర్ధంతి కమిటీ నిర్వాహకులు దారం సాంబశివరావు, దోవా రమేష్ రాంజీ, సిహెచ్ మణిలాల్ మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో మొట్ట మొదటిసారి పూజ్య ధమ్మ దజ బంతేజిచే అంబేద్కర్ ధమ్మ నివాళి పుణ్యాను మోధన (బౌద్ధ పూజ) జరపాలని, రాజకీయాలకు అతీతంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 6న బస్ స్టాండ్ వద్ద అంబేద్కర్ భవన్ ర్యాలీ, అనంతరం తాలూకా ఎదురు బౌద్ధ పూజ జరుగుతుందని తెలిపారు. అంబేద్కర్ వాదులు డాక్టర్ వీర్రాజు, డాక్టర్ రఘు మల్లేపల్లి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎ బిక్షాలు, పి హనోక్, ఆర్ కోదండరాం, కిషోర్, కె రాజీవ్, ఎన్ సురేష్, కె విజయభాస్కర్, భాస్కర్, మొహిద్దిన్, నాగదేవత, జె బుజ్జి, కె సుధీర్, ఎన్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఒయాసిస్ ఆటోమేషన్ టెక్నాలజీస్ కంపెనీ ఈనెల 4, 5 తేదీల్లో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు గురువారం తెలిపారు. బిటెక్ ఇఇఇ, ఇసిఇ బ్రాంచిల్లో 2026 విద్యా సంవత్సరంలో పూర్తి చేయబోయే విద్యార్థులకు శుక్రవారం ఉదయం రిక్రూట్మెంట్ ఫెసిలిటినందు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. పోటీని ఎదుర్కొనే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కళాశాల్లో అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు నైపుణ్యంతో ఉద్యోగాలకు ఎంపిక కావాలని సూచించారు. ఈ ఎంపికలకు అర్హత కలిగిన విద్యార్థులు పాల్గొనాలని కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎన్ పూర్ణచంద్రరావు తెలిపారు.

ఆగని గంజాయి అక్రమ రవాణా

రైలులో 6.5 కిలోలు స్వాధీనం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పోలీసులు నిరంతరం తనిఖీలు, నిఘా కొనసాగిస్తున్నప్పటికీ గంజాయి రవాణా ఆగడం లేదు. గురువారం నాడు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు, స్పెషల్ పార్టీ, ఈగిల్ టీం మరియు సిబ్బంది కలసి మాదకద్రవ్యాలను గుర్తించే డాగ్ స్క్వాడ్ తో కలిసి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల బోగీలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్సెల్ కేంద్రాలు తదితర ప్రదేశాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన పార్సిళ్లు, ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులు మరియు ఇతర వస్తువులను ఒక్కొక్కటిగా తనిఖీ చేశారు.

రైలులో పోలీస్ లు తనిఖీలు చేపట్టగా 6.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, పి. రమేష్ తండ్రి పండితులై (48 సం),ఈ రోడ్, కరూర్ జిల్లా, తమిళనాడు రాష్ట్రం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం జి ఆర్ పి పోలీసులకు అప్పగించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసే, విక్రయించే, వినియోగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. గంజాయి మరియు మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266కు తెలియజేయవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు తెలియజేశారు. ఈ తనిఖీలో మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుధాకర్, ఎస్సైలు శివరామయ్య,సుదర్శన్,చెంచయ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి స్వామికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం, తూర్పునాయుడు పాలెంలో మంత్రి స్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొండపి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, పలు శాఖల అధికారులు మంత్రి స్వామికి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో యం.నిడమాలూరు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు బోడపాటి అంజిబాబు, మండల యస్సీ సెల్ ప్రదాన కార్యదర్శి పిడుగురాళ్ళ సురేష్‌బాబు, కొణిజేడు గ్రామ టిడిపి నాయకులు రామా గోపి, వల్లూరమ్మ దేవాలయ చైర్మెన్ బొజ్జా శ్రీనివాసరావు, కాకుటూరివారిపాలెం గ్రామ టిడిపి నాయకులు కొమ్మినేని వెంకటరావు, కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు ఉన్నారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి స్వామి

పొన్నలూరు: మంత్రి స్వామికి పలువురు నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వారిలో టిడిపి పొన్నలూరు మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండల నాయకులు ఉన్నారు.



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

కట్టుదిట్టమైన చర్యలు

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, ఎరువుల లభ్యత, సీజనల్ వ్యాధుల నియంత్రణ ఇతర ప్రాధాన్యత ఆరోగ్య అంశాలు, పాజిటివ్ పబ్లిక్ పెరస్పన్, డాక్యుమెంట్ అప్లోడ్ ఫర్ ఏజెంట్ స్పేస్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. బాపట్ల నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ స్థానిక కలెక్టరేట్లోని మినీ వీక్షణ సమావేశం మందిరం నుండి విక్షణ సమావేశలో పాల్గొన్నారు. ఈ సంధ్బంగా సిఎస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎక్కడా గోనె సంచులు కొరత లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి వేగవతంగా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని, రైతుల



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

నుండి ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు. ఎరువుల కొరత రాకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీజనల్ వ్యాధుల నియంత్రణకు కలెక్టర్లు ప్రత్యేక దష్టి సారించాలని సూచించారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిపై స్టాండర్డ్ గైడెన్స్ జారీ చేసినట్లు తెలిపారు. టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. వాటర్ బోర్న్, వెక్టార్ బోర్న్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఫుడ్ బోర్న్ సంబంధిత వ్యాధులపై ఫుడ్ సేఫ్టీ విభాగం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.రెగ్యులర్ ఫుడ్ టెస్టులు అన్ని వసతి గహాలు, ఇతర చోట్ల వంటశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి టెస్టులు నిర్వహించాలని ప్రతి శనివారం డ్రై డే నిర్వహించాలన్నారు. పట్టణ ప్రాంతాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. చలికాలంలో ప్రభుత్వ సంక్షేమ వసతి గహాలలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వంటగది, భోజనం తయారీ పరిశుభ్రంగా ఉండాలన్నారు. తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. సమావేశం లో సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, ఇన్చార్జి జిల్లా వ్యవసాయ అధికారి అన్నపూర్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ అనంతరాజు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా పౌర సరఫరాల అధికారి జమీర్ భాష,డి. ఏం సివిల్ సప్లై శ్రీలక్ష్మి, డిఎం మార్క్ ఫ్రెడ్ కరుణ శ్రీ, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-జరుగుమల్లి

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి జన్మదిన వేడుకలలో భాగంగా జరుగుమల్లి మండలంలోని కె.బిట్రగుంటలో కెజీబివి బాలికల పాఠశాలలో బెడ్‌షీట్‌లను శింగరాయకొండ సిఐ చావా హజరత్తయ్య పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వట్టిగుంట శివాజీ 272 మంది బాలికలకు దుప్పట్లు తన స్వంత నిధులతో పంపిణీ చేశారు. కెజీబివిలో విద్యుత్ లేని సమయం లో వెలిగే 21 ఛార్జింగ్ బల్బులను అందజేశారు. కార్యక్రమంలో కెజీబివి ప్రిన్సిపల్ యన్. స్రవంతి, సర్పంచి యాటగిరి నాగరాజ్యం, యంఈఓ బత్తల నాగేంద్రవదన్, యంఈఓ-2 డోలా శ్రీనివాసరావు, ఉప్పలపాటి రామయ్య పాల్గొన్నారు.



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న సిఐ హజరత్తయ్య

రోడ్లపై గుంతలు పూడ్చేందుకు చర్యలు

కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలోని రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చేందుకు ఇంజనీరింగ్ సిబ్బంది మరియు నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లతో నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆయన ఛాంబర్ నందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల చివరకి ఒంగోలు నగరం లో ఉన్న రోడ్లపై గల గుంతలను (పాట్ హెూల్స్)ను పూడ్చే పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు మరియు ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు.జనరల్ ఫండ్ కింద కాంట్రాక్టర్లకు నగరపాలక సంస్థ చెల్లించవలసిన మొత్తం బడ్జెట్ కూడా త్వరలోనే అందరికీ చెల్లిస్తామని చెప్పారు. కావున అందరు కాంట్రాక్టర్లు కూడా ఒంగోలు నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. సమావేశంలో ఒంగోలు నగరపాలక సంస్థ మున్సిపల్ ఇంజనీర్ ఏసయ్య, అసిస్టెంట్ ఇంజనీర్లు మరియు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఏఎంఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎఎంఆర్ ఇండియా లిమిటెడ్ ఏజెన్సీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని బిజెఎంసి రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖలీఫాతుల్లా బాషా కోరారు. గురువారం బిజెఎంసి కార్యాలయంలో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రానైట్ క్వారీల రవాణా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ ఏజెన్సీకి గ్రానైట్ రాయల్టీ వసూలు చేయటానికి అనుమతి ఇవ్వటంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. సమావేశంలో బిజెఎంసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ సిద్ధాంబి, రాష్ట్ర కార్యదర్శి షేక్ ఇమామ్, ప్రకాశం జిల్లా అధ్యక్షులు పఠాన్ సాజిద్ ఖాన్ పాల్గొన్నారు.



అవార్డు అందజేస్తున్న డీఎస్పీ, డిఆర్ఒ

పోటీతత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాలలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డిఆర్ఒ బి.చిన ఓబులేసు, ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఆస్టోనా కాన్ఫరెన్స్ హాలులో సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్ (ఇంటరైజ్ ట్రస్ట్ పోర్ట్‌ఫోలియో కంపెనీ) ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ అవార్డ్స్ 2025, సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాలలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను ఇష్టమైన రంగాలలో ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్లు, నాలుగు చక్రాల వాహనాలు నడపుపుతున్నప్పుడు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో కొండమంజూరు ప్రధానోపాధ్యాయురాలు అనిత, ఎన్ఎస్ఎఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.అనీల్ కుమార్ రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ జైరాం అమర్‌బాబు, పిఆర్ఒ నరసింగరావు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడేలా యువత ఆలోచనలు


కలెక్టర్ రాజాబాబు పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నేటి యువత ఆలోచనలు, మేధోసంపత్తి సమాజంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారంతో పాటు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. గురువారం ఒంగోలు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ట్రిబుల్ ఐటి, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ఐడియా టు ఇంపాక్ట్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నమూనాలను కలెక్టర్ ఆసక్తితో తిలకించడంతో పాటు ప్రాజెక్టు పనిచేసే విధానాన్ని వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత వినూత్న ఆలోచనలు, మేధోసంపత్తి, ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించేందుకు జిల్లాలో ఐడియా టు ఇంపాక్ట్ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు ఇలాంటి కార్యక్రమాలు యువతకు మెరుగైన భవిష్యత్తును కల్పించి తద్వారా సమాజానికి ఉపయోగపడేలా ఉంటుందన్నారు. నేడు పలువురు విద్యార్థులు స్వీయ నియంత్రణతో నీటి ట్యాంక్ నింపే వ్యవస్థ, స్మార్ట్ నీటి భద్రత, వ్యాధి హెచ్చరిక వ్యవస్థ, టచ్‌లెస్ స్మార్ట్ డస్ట్‌బిన్, వాయిస్ నియంత్రిత వీల్ చైర్ ఆధారిత సెలైన్ మానిటరింగ్, హెచ్చరిక వ్యవస్థ, ఓవర్ హెడ్ ట్రాన్స్మిషన్ లైన్ల కోసం వైఫై ఎనేబుల్ ఫాల్ట్ డిటెక్షన్ సిస్టమ్, రియల్ టైమ్ లొకేషన్, అత్యవసర హెచ్చరికలతో కూడిన కాంపాక్ట్ మహిళా భద్రతా పరికరం వంటి నమూనాలను రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఈ నమూనాలు ఎంతో ఉపయోగపడతాయని, క్షేత్రస్థాయిలో ఈ నమూనాలను పైలెట్ ప్రాజెక్టు గా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వ పరంగా ఆర్థిక తోడ్పాటు కల్పిస్తామన్నారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త అనే ఆలోచనతో రాష్ట్ర ముఖ్యమంత్రి ముందుకు పోతున్నారన్నారు. సిఎం ఆలోచనలకు అనుగుణంగా యువత ఆలోచనలను, మేధోసంపత్తిని పెంపొందించుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డివిఆర్ మూర్తి, స్టెప్ సిఈఒ పి.శ్రీమన్నారాయణ, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి జి. రవి తేజ, ఎపి సిపిడిసిఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ట్రిపుల్ ఐటి కళాశాల విద్యార్థులు , క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు నమూనాలను పరిశీలిస్తున్న కలెక్టర్



పండ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా కడియాల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ముండ్లమూరు

టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త, యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు దొడ్డాల వెంకట గోపాల ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకట్రావు, సొసైటీ అధ్యక్షులు మేదరమెట్ల వీరనారాయణ చేతుల మీదుగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాలెంపాటి వెంకటరావు, కందిమళ్ళ శ్రీనివాసరావు, కుమిత పేరారెడ్డి పాల్గొన్నారు.



ఫిల్టర్ బహుకరిస్తున్న వాకర్స్ సభ్యులు

పాఠశాలకు ఫిల్టర్ బహూకరణ

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకింగ్ సభ్యులు గుగ్గిలం వెంకట సురేష్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ మహాదేవ వేద పాఠశాల విద్యార్థులకు త్రాగునీటి సౌకర్యార్థం రూ.10వేల విలువైన ప్యూరి ఫైడ్ వాటర్ మిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, నారాయణమూర్తి, సుబ్బారావు, శివాంజనేయ ప్రసాద్, వీరాంజనేయులు, మోహనరావు, శేష సాయి, తుకారాం, కాటమరాజు, లింగేశ్వరరావు, శ్రీనివాసరావు, రామదాసు, ప్రసాదరావు, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.




వైదశాల్లో పండ్లు పంపిణీ చేస్తున్న హేమంత్ కుమార్

రోటరీ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - చీరాల

రోటరీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి మెటర్నిటీ విభాగంలో ప్రసూతి మహిళలకు పండ్లు, జుబ్బాలు, హగ్గీస్ న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్ ఆర్థిక సహకారంతో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా క్లబ్ సభ్యుల సహకారంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షులు బాచిన నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఏడాది పొడవునా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకొచ్చిన సభ్యులకు అభినందనలు తెలిపారు. రోటరీ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాల్లో దాతలు కలిసి రావాలని కోరారు. తమ వంతుగా సేవలు, సహాయం అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ మువ్వల వంశీకృష్ణ, రావి వెంకటరమణ, డాక్టర్ ఆలపాటి విజయకుమార్, నన్నపనేని రామకృష్ణ, రామిశెట్టి వెంకట సాంబశివరావు, ప్రభుత్వ ఆస్పత్రి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శుభాషిణి, రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సిఆర్ఎంటిల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న సిఆర్ఎంటిలు

ప్రజాశక్తి - మార్టూరు

ఉన్నత విద్యార్హతలతో నియమించబడిన సిఆర్ఎంటిల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గద్దె రమేష్ డిమాండ్ చేశారు. 9ఏళ్ల నుండి పెరిగిన ధరలకు అనుగుణంగా సిఆర్ఎంటిల వేతనాలు పెంచకుండ గత ప్రభుత్వం కాలయాపన చేసిందని అన్నారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యార్హతలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని, క్లస్టర్ ప్రాతిపదికన నియమించిన సిఆర్ఎంటిలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగి మరణాంతరం కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలనే డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8న కలెక్టర్ కార్యాలయం వద్ద ఆత్మగౌరవ దీక్ష, ఈనెల 22న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త ఆత్మగౌరవ దీక్ష జయప్రదం చేయాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశిల్దారు ప్రశాంతి, ఎంఈఓ వస్రాం నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

పర్చూరు : మండలంలో పనిచేస్తున్న సిఆర్ఎంలు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారు బ్రహ్మయ్య, ఎంఈఓలు ఎ శివ కోటేశ్వరరావు, వెంకట రామయ్యకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఎపి సిఆర్ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరమ్ పిలుపు మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనిలో భాగంగా డిసెంబర్ 8న కలెక్టర్ కార్యాలయం నందు, డిసెంబర్ 22న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బి క్లస్టర్ విధానం రద్దు చేయాలని, సిఆర్ఎం టీచర్లకు ఎంటీఎస్ ఇప్పించాలని కోరారు. అలాగే 5ఐదేళ్ల నుండి పెరగని వేతనాలు తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. బీఈడీ, టెట్ అర్హతలతో సిఆర్ఎంటి ఉద్యోగం చేస్తున్నందున డీఎస్సీలో వెయిటేజి కల్పించాలని కోరారు. గతంలో మాదిరిగా రవాణా బత్యం కల్పించాలని అన్నారు. ఉద్యోగ విరమణ 62ఏళ్లకు పెంచాలని అన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన సిఆర్ఎం టీచర్లకు కారుణ్య నియామకం చేపట్టి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని కోరారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ఇప్పించాలని అన్నారు. కార్యక్రమంలో సిఆర్ఎంటిలు ఇయు సాయికుమార్, ఉమామహేశ్వరరావు, బి కోటేశ్వరరావు, బి సామ్రాజ్యం పాల్గొన్నారు.

అద్దంకి : మండలంలో పనిచేస్తున్న సిఆర్ ఎంటిఎస్ తమ ఉద్యోగ భద్రత, 2016 పిఎబి ననుసరించి 2019 మార్చి వరకు వేతనపెంపుదల లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతూ పనిబారం పెరిగినప్పటికీ అందుకు తగ్గ సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, చాలీ చాలని జీతాలుతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్న తరుణంలో తమను ఆదుకోవాలని, తమ సమస్యలు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెల్లి న్యాయం చేయాలని 'ఆత్మగౌరవ దీక్ష' గురువారం చేశారు. స్థానిక తహశీల్దారు చరణ్, ఎంఇఒ కెవి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఆర్ఎంటిలు ఎం రమేష్, శంకరరావు, రామకృష్ణ, గురవయ్య పాల్గొన్నారు.



పర్చూరు ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సిఆర్ఎంటీలు



అద్దంకి తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

దేవాలయాల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - పర్చూరు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి, సిఫార్సుతో రాష్ట్ర ప్రభుత్వం ఏడు దేవాలయాల పునర్మాణానికి రూ.8.40 కోట్ల సిజిఎఫ్ నిధులు మంజూరు చేసింది. దేవాదాయ శాఖ కమిషనర్ సిజిఎఫ్ నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలో పలు ఆలయాలు పూర్వవైభవం సంతరించుకొనున్నాయి. పర్చూరు వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.1.75 కోట్లు, భీమేశ్వరాలయానికి రూ.1.50 కోట్లు, దేవరపల్లిలోని వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.1కోటి, గర్నెపూడి విగ్నేశ్వర, విశ్వేశ్వర ఆలయాలకు రూ.కోటి, అనంతవరంలోని వేణుగోపాలస్వామి ఆలయం రూ.1.05 కోట్లు, సురవరపుపల్లి చెన్నకేశవ దేవాలయానికి రూ.1.05 కోట్లు, సంతరావూరు శ్రీ రామ లింగేశ్వర ఆలయానికి రూ.1.05 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులకు 33 శాతం మ్యాచింగ్ గ్రాంట్స్‌తో ఆలయాల పునర్నిర్మాణం చేపట్టనున్నారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన పురాతన దేవాలయాలు ఇప్పుడు పునరుద్ధరణ వైపు అడుగులు వేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు, దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డికి ప్రజల తరపున ఎమ్మెల్యే ఏలూరి కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశ్రీ ఘంటసాలకు ఘన నివాళి



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - అద్దంకి

గాన గంధర్వ పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరావు 103వ జయంతి సందర్భంగా మునిసిపల్ ఆఫీస్ వద్ద గల ఘంటసాల విగ్రహానికి జానపద కళా పీఠం ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సంగీత సామ్రాజ్యానికి ఆయన చేసిన సేవలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షులు డాక్టర్ ఉబ్బా దేవపాలన, కార్యదర్శి విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పద్య రచయిత చెన్నుపాటి రామాంజనేయులు, దాసభారతి అధ్యక్షులు చెన్నుపల్లి నాగేశ్వరావు, రోటరీ పూర్వ అధ్యక్షులు చప్పిడి వీరయ్య పాల్గొన్నారు. రోటరీ ఆధ్వర్యంలో ఘంటసాల జయంతి సందర్భంగా మున్సిపల్ ఆఫీస్ వద్ద గల ఘంటసాల విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ బాచిన శివధర పూర్ణచందర్రావు, సంకా బాబు, ఘంటసాల జ్ఞాన భారతి ప్రెసిడెంట్ శేషగిరి, అంజాద్ భాష, మహమ్మద్ రఫీ, పసుపులేటి ఆంజనేయులు, హరిహరిప్రసాద్, మహాలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

చీరాల : ఘంటసాల విగ్రహానికి పలువురు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఘంటసాల ఆలపించిన అభ్యుదయ గీతాలను గుర్తు చేసుకున్నారు. తెలుగు సాహిత్యంలో ఆయన కృషిని ప్రశంసించారు.

బాపట్ల : చలనచిత్ర సంగీత జగత్తులో ఘంటసాల మరణించినా ఆయన పాటల ద్వారా జీవించే ఉంటారని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ అన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు 13వ వర్ధంతి సందర్భంగా సాహితీ భారతి ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఘంటసాల దాదాపు 10వేల పాటలు పాడి సంగీత ప్రియులను అలరించారని అన్నారు. కార్యక్రమంలో సాహితీ భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావు, కోశాధికారి ఆదం షఫీ, దగ్గుమల్లి శామ్యూల్, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామ చంద్రమూర్తి పాల్గొన్నారు.



ఘంటసాల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం



చంద్రబాబు ఫోటోకు పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

వికలాంగులకు వరాల పట్ల హర్షం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

అంర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు ఇంద్రాధనస్ పేరుతొ ఏడు వరాలు ప్రకటించడం పట్ల దివ్యాంగులు హర్షం వక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలా జోజిబాబు, కొమురి రాదాకృష్ణ మూర్తి, టీడీపీ రేపల్లె విభిన్న ప్రతిభావంతుల కమిటీ అధ్యక్షులు మంచాల స్టాలిన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిఎంగా రామ్మోహనరావు

ప్రజాశక్తి - అద్దంకి



బి రామ్మోహనరావు

స్థానిక ఆర్టిసి డిపో మేనేజర్‌గా బి రామ్మోహనరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో కార్మికులకు అండగా ఉంటానని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు, కార్మికులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

తప్పిపోయిన మహిళ

ప్రజాశక్తి - పంగులూరు



ఎస్ కొండమ్మ

మతి స్థిమితం లేని ఒక మహిళ గత నాలుగు రోజులుగా కనబడటం లేదని మండలంలోని బైటమంజులూరు గ్రామస్తులు గురువారం తెలిపారు. బైట మంజులూరుకు చెందిన 54ఏళ్ల సరికొండ ఆదిరాజు భార్య సరికొండ కొండమ్మ గత కొన్నేళ్లుగా మతిస్థిమితం లేక ప్రక్కనున్న భగవాన్ రాజుపాలెం, ముప్పవరం పరిసర గ్రామాల్లో తిరుగుతూ ఉండేది. సాయంత్రానికి ఇంటికి వస్తూ ఉండేది. అయితే గత నాలుగు రోజులుగా ఆమె కనపడటం లేదని గ్రామస్తులు తెలిపారు. ఎక్కడికెళ్ళిందో తెలియటం లేదని చెప్పారు. ఈ విషయమై రేణింగవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఆచూకీ తెలిసిన వాళ్లు 70933 95116, 95819 37968 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బంధువు అంత్యక్రియలకు వస్తూ... మృత్యు ఒడికి

- కారు టైరు పేలి రోడ్డు ప్రమాదం
- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
- చీరాల, కారంచేడు జాతీయ రహదారిపై ఘటన
- మృతుడు టివి9 వీడియో ఎడిటర్‌గా గుర్తింపు

ప్రజాశక్తి - చీరాల

బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఓ వ్యక్తి దుర్మరణం పాలైన హృదయ విదారక సంఘటన చీరాల, కారంచేడు నూతన జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. మృతుని సోదరుడు ముంగుర జాన్ సిల్వెస్టర్ అందించిన వివరాల ప్రకారం చీరాల సంపత్ నగర్ కాలనీకి చెందిన తాము హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు మనోహర్ రాజు (45), నిరీక్షణ రాజు, జాన్ సిల్వెస్టర్ మండలంలోని వాడరేవులో తమ బంధువు ముంగుర నాగరాజు బుధవారం మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలకు హాజరయ్యేందుకు హైదరాబాద్ నుంచి కారులో బయలుదేరారు. కారును నిరీక్షణ రాజు నడుపుతున్నారు. కారంచేడు సమీపానికి చేరుకున్న సమయంలో కారు రన్నింగ్‌లో ఉండగానే టైరు అకస్మాత్తుగా పేలిపోవడంతో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి పల్టీలు కొట్టి బోల్తా పడింది.


ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న ఎస్ఐ ఖాదర్‌బాష

ప్రమాదంలో సీట్‌బెల్ట్ పెట్టుకున్నప్పటికీ పెద్ద అన్నయ్య మనోహర్ రాజు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అన్నదమ్ములైన నిరీక్షణ రాజు, జాన్ సిల్వెస్టర్లకు గాయాలయ్యాయి. పొలం పనులు చేస్తున్న స్థానికులు పరుగెత్తుకొని వచ్చి కారులో నుండి తమను బయటకు తీసి సహాయం చేశారని తెలిపారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చి గాయపడిన తమను చీరాల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కారంచేడు ఎస్ఐ ఖాదర్ భాష సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిక్షించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు మనోహర్ రాజు వివాహితుడు కాగా హైదరాబాద్‌లో టివి9 ఛానెల్‌లో న్యూస్ ఎడిటర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పరామర్శకు బయలుదేరిన కుటుంబంపై మృత్యువు కాటేయడంతో బంధువులు, సహోద్యోగులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

కారంచేడు : హైదరాబాద్ నుంచి వాడరేవు వెళ్తున్న కారు కారంచేడు బైపాస్ రోడ్డులో టైరు పగలడంతో బోల్తా పడింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం జరిగింది. నూతనంగా నిర్మిస్తున్న హైవేలో కారంచేడు, కుంకలమర్రు రోడ్డు దాటిన తర్వాత కుంకలమర్రు డొంక రోడ్డు సమీపంలో కారు వెనుక టైరు పగిలిపోవడంతో అదుపుతప్పి ఫల్టీలు కొట్టి ఎడమ రోడ్డులో నుండి కుడి రోడ్డులోకి బోల్తా పడింది. ఈ ఘటనలో ముంగర మనోహరరాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. అతని సోదరులు ఇద్దరికీ తీవ్ర గాయాలైనట్లు చెప్పారు. గాయపడ్డ ఇద్దరినీ చికిత్స నిమిత్తం చీరాల వైద్యశాలకు పంపినట్లు తెలిపారు.


చికిత్స పొందుతున్న నిరీక్షణ రాజు, జాన్ సిల్వెస్టర్ సోదరులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

డ్వాక్రా మహిళలకు పాడి పశువులు అందజేత

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని ఇంటూరులో, రామ మందిరం పక్కన రాయల రఘు డెయిరీ ఫారం సమీపంలో ప్రొప్రయిటర్ అత్తోట వేణు, అక్షయ ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో సమకూర్చిన పాడి పశువులను శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించడం ద్వారానే గ్రామీణ మహిళల ఆర్థిక స్థిరత్వం సాధ్యం అవుతుందని అన్నారు. డ్వాక్రా లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, ఎంపిడిఒ మారుతి శేషమాంబ పాల్గొన్నారు.


పేకాట శిబిరంపై దాడిలో పాల్గొన్న పోలీసులు

పేకాట జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని నాగులపాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న శిభిరంపై ఎస్ఐ జివి చౌదరి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గురువారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న 12మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుండి రూ.21,672 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు ప్రజాదర్బార్


ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య తన క్యాంపు కార్యాలయంలో నేడు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.

జీతం ఒక చోట.. పని మరొక చోట

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత వైసిపి ప్రభుత్వంలో పంచాయతీల్లో పాలన ప్రజలకు చేరువ చేసేందుకు సచివాలయాలు ఏర్పాటు చేశారు. దానికి అనుగుణంగానే సచివాలయాల్లో అవసరమైన సిబ్బందిని నియమించారు. వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించారు. వీరిలో గ్రామ సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సిబ్బందిని కేటాయించారు. అయితే వీరందరికీ ఆయా సచివాలయాల పంచాయతీ అభివృద్ధి అధికారి (డిడిఓ) పర్యవేక్షణలో పనిచేస్తూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతున్న నూతన యాప్‌లు, సర్వేలను వీరి ద్వారానే చేపట్టాల్సి ఉంటుంది. దీనికి డిడిఓ అధికారాలు కలిగిన పిడిఓ వీరందరికీ వేతనాలు కేటాయిస్తూ ఉంటారు. అయితే దీనిలో పనిచేసే గ్రామ సర్వేయర్లు మాత్రం అందుకు భిన్నంగా సచివాలయాల్లో వేతనాలు పొందుతూ సచివాలయాలకు దూరంగా తహశీల్దారు కార్యాలయంలో మండల సర్వేయర్‌తో కలిసి పనులు చేస్తున్నారు. వీరు మండల సర్వేయర్ ఆధీనంలో రీ సర్వే పనులు సాకుగా చూపుతూ సచివాలయాలతో సంబంధం లేని విధంగా వ్యవహరిస్తున్నారు. ఈ గ్రామ సర్వేయర్లకు వేతనాలు డిడిఒ అధికారం కలిగిన కార్యదర్శి వేస్తూ ఉండగా మెటర్నిటీ సెలవులు, ఇతర సెలవులతోపాటు వీరికి ఇంక్రిమెంట్లు, డిఎలు వంటి సౌకర్యాలు ఎంపిడిఒ ద్వారా జరగాల్సి ఉంది. సచివాలయాల పరిధిలో చేపట్టే వివిధ ప్రభుత్వ పథకాల సర్వేలను ఈ గ్రామ సర్వేలు కూడా నిర్వహించాల్సి ఉండగా వీరు అందుకు భిన్నంగా ఎలాంటి ప్రభుత్వ సర్వేల్లో పాల్గొనకుండా తహశీల్దారు కార్యాలయంలోనే మండల సర్వేయర్‌తో కలిసి ఉండటంతో గ్రామాల్లో అనేక ప్రభుత్వ సర్వేయర్లు ముఖ్యమైన కార్యకలాపాలు నిలిచిపోతున్నాయని పంచాయతీ అభివృద్ధి అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఒక దశలో అనేక మంది గ్రామ సర్వేయర్లకు ఎంపిడిఒ ఎవరో కూడా తెలియని పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు. తహశీల్దారు కూడా ఈ గ్రామ సర్వేయర్లను వారికి అవసరమైన పనులకు వినియోగించుకోవడానికి కలెక్టర్ నుండి అనుమతి పొందాల్సి ఉంది. ఎలాంటి అనుమతులు లేకుండానే వీరిని రీ సర్వే పనులు, రెవెన్యూ కార్యకలాపాలకు వినియోగించుకోవడం పట్ల పలువురు ఆక్షేపణలు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి అన్ని మండలాల్లో నెలకొందని, దీనిని తహశీల్దార్లు, మండల, గ్రామ సర్వేయర్లను గుర్తించి ప్రభుత్వ పథకాల సర్వేలు, వాటి అమలు తీరుకు సచివాలయ అధికారులకు సహకరించాలని, తద్వారా గ్రామాల్లో సుపరిపాలన కొనసాగేందుకు తోడ్పాటు అందించాలని కోరుచున్నారు.


భట్టిప్రోలు గ్రామ సచివాలయం

తన భూమి ఇవ్వాలని బాధితుడి అభ్యర్ధన

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని ఈదర గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన కాలువ సుధాకర్ తండ్రి రామయ్య పేరుతో 280-2సర్వేలో ఉన్న 92 సెంట్లు భూమి ఉంది. ఆ భూమి ప్రస్తుతం గ్రామానికి చెందిన ఘనసాల ఏడుకొండలు, ఘనసాల పుల్లమ్మ, శ్రీనివాసరావులు తమకు విక్రయ దస్తావేజు ఉందని దర్శి కోర్టును ఆశ్రయించారు. దర్శి కోర్టులో 2012లో తనకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై ప్రత్యర్థులు మార్కాపురం కోర్టుకు అప్పీలుకు వెళ్ళగా 2016లో తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, మరల ప్రత్యర్థులు హైకోర్టును ఆశ్రయించారని 2023లో హైకోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపాడు. కోర్టు ఆర్డర్లో తన తల్లి పేరు మీద ఉన్న రిజిస్ట్ పత్రాలు రెవెన్యూ కార్యాలయానికి సమర్పించినప్పటికీ తనకు న్యాయం చేయకపోవడంతో కలెక్టర్‌ను ఆశ్రయించానని తెలిపారు. కలెక్టర్ వెంటనే పాస్ బుక్ మంజూరు చేయాలని తహశీల్దారును ఆదేశించారు. దీంతో తహశీల్దారు, కలెక్టర్‌కు, ఆర్‌డిఒకు ఎండార్స్‌మెంట్ ఉత్తరులు ఇచ్చారు. ప్రస్తుతం ఈ పొలాన్ని తనకు స్వాదీనం చేయాలని కోరగా ప్రత్యర్థుల హైకోర్టును ఆశ్రయించారని, పాసుబుక్కు ఇవ్వడానికి వీలు లేదని తహశీల్దారు తెలిపాడని, 10ఏళ్ల నుండి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ రికార్డుల్లో తన ముత్తాత కాలువ రామయ్య పేరుతో ఎఫ్ఎల్ఆర్, వన్ బి, వన్ ఎ, అడంగల్, ఎఫ్ఎంబి రికార్డుల్లో నమోదై ఉన్నప్పటికీ తనకు న్యాయం చేయకుండా రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారని బాధితుడు సుధాకర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వైద్య శాల సందర్శిస్తున్న జెడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య

ప్రభుత్వ వైద్యశాల సందర్శన

ప్రజాశక్తి - నిజంపట్నం


మండలంలోని నిజాంపట్నం ప్రభుత్వ ప్రజా వైద్యశాలను జడ్పిటిసి నర్రా సుబ్బయ్య గురువారం సందర్శించారు. వైద్యం పొందుతున్న రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వైద్య అధికారులు చూడాలని తెలిపారు. అనంతరం రాత్రి వేళలో డ్యూటీ చేసే వైద్యాధికారులు బాత్రూములు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన స్పందించి ఈ సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైద్యులు డాక్టర్ కె స్వప్న, డి అనూష, స్టాప్ నర్సులు, సిబ్బంది ఉన్నారు.


డిప్యూటీ ఎంపిడిఒ బాధ్యతలు స్వీకరిస్తున్న ఎ ఖాదర్ జిలాని

డిప్యూటీ ఎంపిడిఒ జిలాని

ప్రజాశక్తి - పర్చూరు

డిప్యూటీ ఎంపిడిఒ (జిఎస్‌డబ్ల్యూఎస్) గా షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అప్పికట్ల పంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతి పొంది పర్చూరు వచ్చారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్‌కు జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు ఉత్తర్వులు అందుకున్నారు.


మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఈపూరు గణేష్

కోటి సంతకాలతో ప్రవేటీకరణను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయానికి ప్రజల నుండి సేకరిస్తున్న కోటి సంతకాలతో తిప్పికొట్టాలని వైసిపి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని 8వ వార్డులో వైసిపి ఇన్చార్జి డాక్టర్ ఈఊరు గణేష్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. వైద్య కాలేజీలు ప్రైవేటీకరణ చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా చేపట్టిన 'కోటి సంతకాల సేకరణ' పెద్దఎత్తున కొనసాగించారు. ప్రజాభిప్రాయం తెలిసివచ్చే విధంగా చేయాలని అన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిత్రాల ఓబేదు, జిల్లా ఉపాధ్యక్షులు చదలవాడ శ్రీనివాసరావు, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పట్టెం శ్రీనివాసరావు, ఎస్టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ, యువజన విభాగం అధికార ప్రతినిధి నీలం వీరేంద్ర, క్రిస్టియన్ మైనరిటీ సెల్ అధ్యక్షులు సముద్రాల ప్రభుకిరణ్, నీల నాంచారయ్య, వీసం నాగలక్ష్మి, ఆనంద్, ఖాదర్, ఖుద్దూస్, గౌస్, లాకత్ బాషా, సతీష్, కమల్ రాజ్‌పాల్, రాజేష్, చింటూ, మున్నా, పృధ్వి, కిరణ్, సాయి, అలీ, డానీ పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో 15 మెడల్స్ సాధించిన

కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పోలీస్ సిబ్బంది క్రీడల్లో కూడా సత్తా చాటాలని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహిస్తామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. స్విమ్మింగ్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటి బ్రాంజ్ మెడల్ సాధించిన కానిస్టేబుల్ పి. నాగ బ్రహ్మారెడ్డిని గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అభినందించి, మెడల్ తో సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. బాపట్ల జిల్లా పిజిఆర్ఎస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న 2013 వ బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ పి.నాగబ్రహ్మారెడ్డి, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలం గాణ రాష్ట్రం హైదరాబాద్ నగరంలోని గచ్చి బౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో 2025 నవంబర్ 21 నుండి 23 వరకు నిర్వహించిన 21వ నేషనల్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ - 2025లో పాల్గొన్నారు. 400 మీటర్ల ఫ్రీ స్టైల్ స్విమ్మింగ్ ను 6.44 నిమిషాలలో పూర్తి చేసి బ్రాంజ్ మెడల్‌ను సాధించాడు.



కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పి.నాగ బ్రహ్మారెడ్డి స్విమ్మింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో సత్తా చాటి బ్రాంజ్ మెడల్ గెలుచుకోవడం అభినందనీయమన్నారు. గతంలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని 15 మెడల్స్ సాధించి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశారని పేర్కొన్నారు. ఎంతో పట్టుదల, కృషి, సాధన ఉంటేనే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే స్విమ్మింగ్ పోటీల్లో కూడా పాల్గొని సత్తా చాటాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖ విధులు ఎంతో ఒత్తిడితో కూడుకున్నవని, పోలీస్ విధుల్లో విశ్రాంతి సమయం ప్రత్యేకంగా ఉండదని, శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండవలసి ఉంటుందన్నారు. క్రీడల ద్వారా మానసిక ఒత్తిడిని సులభంగా జయించవచ్చని, క్రీడల వల్ల శరీరం దృఢంగా మారడంతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న వారు బ్రహ్మారెడ్డిని ఆదర్శంగా తీసుకొని క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచే పోలీస్ అధికారులు, సిబ్బందిని ప్రోత్సహిస్తామని ఎస్పీ తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

గ్రేవ్ కేసుల్లో విచారణ వేగవంతం

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

గ్రేవ్ కేసుల్లో విచారణ వేగవంతం చేయాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. దర్యాప్తు లో ఉన్న నేరాలు, దొంగతనం, గంజాయి మరియు ఇతర గ్రేవ్ కేసులు,కేసుల గుడ్ ట్రయల్ మానిటరింగ్, ఎన్ఫోర్స్మెంట్/ రోడ్డు ప్రమాదాలు మరియు తదితర అంశాలపై జిల్లా పోలీస్ కార్యాలయ నుండి ఒంగోలు, దర్శి, కనిగిరి మరియు మార్కాపురం సబ్ డివిజన్ ల డీఎస్పీ, సీఐ, ఎస్సైలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి ఆయా కేసుల సత్వర పరిష్కారంకు దోహదపడే విధంగా తగిన సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ సమగ్ర దర్యాప్తు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ముద్దాయిలను అరెస్ట్ చేసే విధంగా, తగిన సాక్ష్యాధారాలతో కోర్ట్ లో నిర్ణీత సమయంలో కోర్టులో ఛార్జ్ షీట్ ఫైల్ చేయడంతో పాటు, కేసుల్లో శిక్షాశాతం పెంచేందుకు ఎక్కువ కషి చేయాలని సూచించారు. సంవత్సరం ముగింపు సందర్భంగా పెండింగ్ కేసులను త్వరితగతంగా తగ్గించాలన్నారు. సమావేశంలో ఎస్బి డిఎస్పీ చిరంజీవి, ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ, మార్కాపురం డిఎస్పీ యు. నాగరాజు, కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి రమణ కుమార్, డిసిఆర్ బి సిఐ దేవ ప్రభాకర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, పిసిఆర్ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు చేరువ చేసేందుకే..

- డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు ఏర్పాటు
- ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



డిడిఒ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేందుకు డివిజన్ అభివద్ధి అధికారి కార్యాలయాలను ఏర్పాటు చేయడమైందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం నాడు బాపట్లలోని శీలంవారిపాలెం లో డివిజనల్ అభివద్ధి అధికారి కార్యాలయ ప్రారంభోత్సవానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై డివిజన్ అభివద్ధి అధికారి కార్యాలయాన్ని, సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా నుండి రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి సంస్థ, అటవీ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ప్రారంభించారని ఆయన తెలిపారు. అనంతరం డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత కార్యక్రమాన్ని ఆయన అధికారులతో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.

బాపట్ల డివిజన్ అభివద్ధి అధికారి కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సాధారణ నిధులు 10 శాతం సెక్టోరియల్ నుండి రూ 15.15 లక్షలతో కార్యాలయం, సమావేశ మందిరం, మరుగుదొడ్లను నవీకరించి ఖర్చు చేశారని ఆయన తెలిపారు. కార్యాలయ ఏర్పాటు ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సంక్షేమ పథకాల అమలుపై నిత్యం పర్యవేక్షణ చేయడానికి ఈ కార్యాలయాలు కీలక కేంద్రాలుగా నిలుస్తాయని ఆయన అన్నారు.అభివద్ధి పనుల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని, ప్రజలు ఎదుర్కొనే సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ఇది దోహదపడుతుందన్నారు.

కార్యక్రమంలో గుంటూరు పంచాయతీ రాజ్ సహాయ సంచాలకులు పి జనార్ధన్‌రావు, బాపట్ల డివిజన్ అభివద్ధి అధికారి సిహెచ్ విజయలక్ష్మి, డ్వామా పీడీ విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, ఎమ్మార్వో సలీమా, బాపట్ల ఎంపీడీవో బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పోస్టుల దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మార్కాపురం శివసాయి ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూల్ లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ గడువును పెంచినట్లు డిఇఒ కిరణ్‌కుమార్ గురువారం నాడు ఒక ప్రకటన లో పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ అభ్యర్థన మేరకు, అర్హులైన అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 30 నుంచి డిసెంబర్ 15 వరకు గడువును పెంచినట్లు చెప్పారు. అభ్యర్థులు ఆన్లైన్, పోస్టు ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలన్నారు. మాథ్స్, సోషల్, హిందీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మూడు ఓసీ జనరల్ కు కేటాయించినట్లు తెలిపారు.

ఫీజుల చెల్లింపునకు

డిజిటల్ వాడకంపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాఠశాలలలో ఫీజులు చెల్లించడానికి (యుపిఐ) రియల్ టైం చెల్లింపు వ్యవస్థ వాడకం, ఉపాధ్యాయులకు శిక్షణ, వ్యవస్థ వినియోగం పెంపు చర్యలపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర విద్యా శాఖ సహాయక మంత్రి జయంత్ చౌదరి సమాదానమిస్తూ అన్ని ఆర్థిక లావాదేవీల డిజిటల్ చెల్లింపులకు వాడే వివిధ రకాల ఎలక్ట్రానిక్ మాధ్యమాలను మాదిరిగానే పాఠశాలలలో ఫీజులు చెల్లించడానికి ఉపయోగపడే (యుపిఐ) రియల్ టైం చెల్లింపు వ్యవస్థను కూడా ప్రభుత్వం మద్దతు ఇస్తుందన్నారు. విద్య రాష్ట్రాలకు పరిధిలోనివని, ఫీజు వసూలు పద్ధతులు, పాఠశాలలలో డిజిటల్ చెల్లింపులు వంటి విషయాలు రాష్ట్రాలు చూస్తాయని తెలిపారు. అన్ని పాఠశాలలలో అన్ని ఫీజులు వసూలుకు (యుపిఐ) రియల్ టైం చెల్లింపు వ్యవస్థకు సంబంధించి పరిశీలన, డిజిటల్ పద్ధతులు వంటి అన్ని విషయాలకు సంబంధించి రాష్ట్రాలకు అన్ని సలహాలను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఇస్తుందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

ఘనంగా మంత్రి స్వామి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శింగరాయకొండ


రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయ, వాలంటీర్ల, వయోవద్ధుల శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి పుట్టినరోజు వేడుకలు గురువారం రాత్రి టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో వైభవంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరై.. మంత్రి స్వామికి శుభాకాంక్షలు తెలిపారు.




తిరుమలలో కుటుంబసభ్యుల మధ్య కేక్ కట్ చేస్తున్న మంత్రి స్వామి

వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి

ముందుగా మంత్రి స్వామి కుటుంబసభ్యులతో కలిసి తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామిని గురువారం ఉదయం దర్శించుకుని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబసభ్యుల సమక్షంలో పుట్టినరోజు వేడుకల కేకును తిరుమలలో మంత్రి కట్ చేశారు. వీరి ఓఎస్‌డి కామేశ్వరరావు ఉన్నారు. శింగరాయకొండ సాయిబాబా దేవస్థానంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కూనపురెడ్డి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేకును కట్ చేసి.. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పులి ప్రసాద్, కనిగిరి వెంకటేశ్వర్లు, సాదం బ్రహ్మయ్య, కేత చంద్రశేఖర్, దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ కొల్లూరి సత్యనారాయణ పాల్గొన్నారు.



మంత్రి స్వామికి శుభాకాంక్షలు తెలుపుతున్న దామచర్ల పూర్ణచంద్రరావు



మంత్రి స్వామికి శుభాకాంక్షలు తెలుపుతున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర